క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన కన్నెగంటి గోపీచంద్, పార్వతి దంపతుల మనుమడు కన్నెగంటి వీరవభ శ్రీ హృదయ సాయి పుట్టిన రోజు వేడుకలను ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో జరిపారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, శిరీష, వాణికుమార్, బాబిజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ్యానికి ఆదర్శం పరశురాముడు



తెనాలి: అక్షయ తృతీయ, భగవాన్ పరశురామ జయంతిని శనివారం రాత్రి స్థానిక కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. దుష్టులైన రాజులను శిక్షించి, గోవులను, బ్రాహ్మణులను కాపాడిన దశావతారాల్లో ఆరో అవతారమైన భగవాన్ పరశురామ అవతారం బ్రాహ్మణ్యానికి, నేటి బ్రాహ్మణ యువతకు ఆదర్శమని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాచిమంచి జయసింహమూర్తిని ఘనంగా సత్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ, త్రిపురారి భట్ల దత్తాత్రేయశాస్త్రి, చెన్నా ప్రగడ శ్రీనివాస్, కావూరి సత్యనారాయణ, లక్కరాజు లక్ష్మణరావు, మన్నెపల్లి ఆది శేషగిరిరావు, మాగంటి చిన్నశాస్త్రి, ఆనంద శర్మ, భాగవతుల రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఏపీఆర్‌జేసీ మాక్ టెస్ట్

తెనాలిఅర్బన్: ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల మాక్ టెస్ట్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు కోచింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్, ఇతర పరీక్షల విధానాలపై అవగాహన సదస్సు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారందరూ పాల్గొన వచ్చని తెలిపారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్



తెనాలిఅర్బన్: యుగ పురుషుడు ఎన్టీఆర్ అని డాక్టర్ ఎంబీ నాగేశ్వరరావు, మహ్మద్ అయాజుద్దీన్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ నటించిన సినిమాలపై శనివారం సాయంత్రం కొత్త పేటలోని పెన్షనర్స్ హాల్‌లో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు వేము రామరాజుతో పాటు వక్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వెనిగళ్ళ శివప్రసాద్, కంచర్ల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తెనాలిఅర్బన్: కొత్త పేటలోని ధరణి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 2003లో పదోవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గౌతమ్ గ్రాండ్‌హోటల్‌లో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్కూల్ డైరెక్టర్ వి.బాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రామ పుల్లయ్య, గోపాలచార్యులు, అలేఖ్య, సుభాష్ చంద్రబోస్, హిమజ, వై.రవికుమార్, పూర్వ విద్యార్థులు ఎం.కోదండ రామశాస్త్రి, నళిని, హనుమంత్, విద్యాసాగర్, అన్నపూర్ణ, పావని, మణి సుధీర్, ఇంద్రజిత్, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

తెనాలిరూరల్: వాహనం అదుపుతప్పి పాస్టర్ మృతి చెందిన ఘటన తెనాలి మండలం హాఫ్‌పేట వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన గిరిగి శ్రీరాములు (54) గుంటూరు జిల్లా కొల్లిపర మండలం పిడపర్రు గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన సంఘస్థుడు మోహనరావుతో కలిసి బైక్‌పై గుంటూరు వెళ్తుండగా హాఫ్‌పేట దాటాగానే వాహనం అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. ఘటనలో శ్రీరాములు గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ముగిసిన రంజాన్ ఉపవాస దీక్ష
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు
- పెద్దలకు నివాళులు.. పేదలకు దానాలు



స్వీట్లు పంచుతున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: ఈదుల్ ఫితర్ పర్వదిన వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చెంచుపేటలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని 23 మసీదుల పరిధిలోని ముస్లింలు ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి, సంప్రదాయం ప్రకారం సేమియా పాయసం, ఖర్జూరాన్ని ఆరగించి, పరిమళ భరిత అత్తరును దుస్తులకు రాసుకుని, తలపై టోపీలు ధరించారు. 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్‌ద్ అనే స్తోత్రాన్ని పఠిస్తూ ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ చెంచుపేట హీరా మసీదు ఇమామ్ ముఫ్తీ హైదర్ అలీ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పక్కనే గల ముస్లిం శ్మశానవాటికకు వెళ్లి, పెద్దల సమాధులపై పూలు చల్లి, నివాళులర్పించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున ఈసారి ఉదయం 9.30 గంటలకే నమాజ్ చేశారు. ప్రార్థనల్లో పాల్గొనే ముస్లింల కోసమని ఈద్గాలో భారీ ఏర్పాట్లు చేశారు. పెండ్యాల ఖానా షామియానాలు, అతి పెద్ద కూలర్లు, నేలపై గ్రీన్ మ్యాట్‌లు, పూలతో అలంకరణలు చేశారు. భక్తి భావనను పెంచే ఫ్లెక్సీలు, నమాజ్‌కు ముందు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునే 'వజూ' కోసం మంచినీటి కుళాయిల ఏర్పాటుతో పాటు ప్రతి ఒక్కరికి వాటర్ బాటిళ్లు అందజేశారు. సౌదీ అరేబియాలోని కాబా, మదీనా నమూనాలను కొత్తగా ఈ ఏడాది నిర్మించటం, ప్రహరీపై ప్రత్యేకంగా మినార్ల ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఈద్గా ప్రార్థనలో పాల్గొన్నారు. పేద ముస్లింలకు అందుబాటులో ఉండేలా రూ.6 కోట్ల వ్యయంతో షాదీఖానా నిర్మించనున్నట్టు ప్రకటించారు. తగిన స్థలాన్ని చూపినట్టయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రూ.4 కోట్లు, స్థానికుల సహకారంతో రూ.2 కోట్లు సేకరించి షాదీఖానా నిర్మిస్తామని చెప్పారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు పంచారు. సంబంధిత ఏర్పాట్లను ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, కార్యదర్శి షేక్ సలీం, ఉపాధ్యక్షుడు షేక్ జాని పర్యవేక్షించారు. చినరావూరు ఈద్గాలో ఖారీ ఖ్రముజ్జమ, పాండురంగపేటలోని మక్కా మసీదులో మౌలానా షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. ఈద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు రాజకీయపార్టీలు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

తెనాలిటౌన్: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కొలకలూరులోని ఈద్గాలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి పాల్గొని, మిఠాయిలు అందజేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ ధూళ్ళ వెంకటరామయ్య, గుంటూరు కృష్ణమోహన్‌ను అంజుమన్ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. రంజాన్ పర్వదిన విశిష్టతను మసీదు ఇమామ్ షేక్ లియాకత్ వివరించారు. అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ బాజీ, సెక్రటరీ సయ్యద్ ఆజీమల్, మాజీ ప్రెసిడెంట్‌లు షేక్ ఆజీజ్, పఠాన్ ఖురాన్, షేక్ ననే, హుస్సేన్, షేక్ సుభానీ, పఠాన్ నాగూర్ మీరా, షేక్ కాలేషా, ఇమామ్ సాబ్, షేక్ ఆసీం, ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు. రూరల్ మండలం నందివెలుగు, తేలప్రోలు, పెదరావూరు, కఠెవరం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



ప్రార్థనలో ఎమ్మెల్యే శివకుమార్



ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



కొలకలూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు..

జీవ వైవిధ్య సంరక్షణతోనే మానవ మనుగడ

ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభ



ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభలో వీఆర్ జ్యోత్స్న కుమారి, సంతోషకుమారి, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవ వైవిధ్య సంరక్షణతోనే భూమిపై మానవ మనుగడ సాధ్యమని బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోషకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా యువజన సర్వీసులశాఖ – స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతోషకుమారి మాట్లాడుతూ యువతరం ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణను పాటించడం ద్వారా భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలని సూచించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ పారిశ్రామిక విప్లవం అనంతరం పర్యావరణ పరిరక్షణ తద్వారా భూమిని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం పెను సవాలుగా మారిందన్నారు. ఈసందర్భంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవ ఉద్దేశాన్ని కళాజాతర ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, స్టెప్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కేఎస్ఎస్వార్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనీకుడు లెనిన్



లెనిన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్ర ప్రసాద్, రామారావు

పాత గుంటూరు: మార్క్సిస్టు సిద్ధాంతాన్ని తొలిసారిగా సోవియట్ యూనియన్‌లో అమలు జరిపి ఆచరణలో పెట్టిన గొప్ప దార్శనీకుడు వి.ఐ.లెనిన్ అని, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని సోవియట్‌లో అమలు జరిపిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం బ్రాడీపేట సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, నిత్యావసర సరుకుల ధరలు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మూర్తి, మోహన్‌రావు, శైలజ, మాధవరావు, శేషగిరి, సీపీఎం నాయకుడు వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వివాదంలో తోపులాట.. వ్యక్తి మృతి

కొల్లూరు: రోడ్డు మీద పడిన వరిగడ్డి శుభ్రం చేసే విషయంలో చోటు చేసుకున్న వివాదం తోపులాటగా మారి ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెసర్లంక రామన్నపేట ప్రాంతంలో నివాసముంటున్న సాత వీరశంకర్ (59) తన వరిగడ్డిని విక్రయించాడు. ట్రాక్టర్‌లో తరలించే క్రమంలో వారి ఇంటి ఎదురుగా ఉన్న గరికపాటి సీతమ్మ ఇంటి ముంగిట వరిగడ్డి పడింది. వరిగడ్డిని శుభ్రం చేయాలని సీతమ్మ ఉదయం నుంచి గొడవ చేస్తూ ఉంది. రాత్రి 8 గంటల ప్రాంతంలో వివాదం రెండు కుటుంబాల మధ్య తారస్థాయికి చేరుకుంది. సీతమ్మ, ఆమె కుమారుడు శివ వెంకటేశ్వరరావు, కోడలు దేవీ వీరశంకర్‌పైకి గొడవకి వెళ్లారు. మాటామాట పెరగడంతో శివ వెంకటేశ్వరరావు వీరశంకర్‌ను బలంగా నెట్టడంతో సీసీ రోడ్డుపై పడి అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే అతనిని బంధువులు తెనాలిలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి వీరశంకర్ మృతిచెందాడు. మృతుడు కుమారుడు బాలసుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు ఎస్‌ఐ రాజీవ్‌కామ్యూల్‌కుమార్ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

భట్టిప్రోలు: వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు బౌద్ధ స్థూపం సమీపంలో స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాల ఆవిష్కరణ ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ బందారు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవి దుక్కులు..రైతుకు మేలు

- సూక్ష్మజీవుల వృద్ధి
- కలుపు, చీడపీడల నివారణ
- ముందు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి
- తెనాలి ఏడీఏ వెంకటరావు



తెనాలి ఏడీఏ, కె.వెంకటరావు



ట్రాక్టర్‌తో దుక్కి దునున్నతున్న రైతు

కొల్లిపర: వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. భూమి సారవంతమై, సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. కలుపు, చీడపీడలు నివారించవచ్చు. కోతలు పూర్తయ్యాక పంట వ్యర్థాలను తగలబెట్టి అలాగే వదిలేస్తే భూమిలోని సారం దెబ్బతిని తదుపరి పంటలపై ఆ ప్రభావం పడుతుంది. భూమిలోని లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంటలు చేతికందగానే పంటల అవశేషాలను దుక్కలు చేసి ఆరబెట్టాలని తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వెంకటరావు తెలిపారు. సమగ్ర సస్యరక్షణలో వేసవి దుక్కులు ఉపయోగపడతాయని ఆయన రైతులకు సూచిస్తున్నారు.

కలుపు మొక్కల నివారణ ఇలా

వ్యవసాయ భూముల్లో పంటలు వేయకుండా అలాగే ఉంచితే కలుపు పెరిగి, భూసారం దెబ్బతింటుంది. చీడపీడలకు ఆశ్రయం కలుగుతుంది. మొండి జాతికి చెందిన తుంగ అన్ని రకాల భూముల్లోనూ ఎదుగుతుంది. వేర్లలో ఆహారాన్ని నిల్వ చేసుకొని భూ సారాన్ని దెబ్బతీస్తుంది. కోతలు పూర్తయ్యాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. వేసవి దుక్కులు చేయడం వల్ల వరిలో ఆకుచుట్టు పురుగు, కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు, జొన్న, మొక్కజొన్నలో కత్తెర పురుగు, లద్దె పురుగులు, భూమి పొరల్లో దాగిన చీడ పురుగుల గుడ్లు, కోశాలు వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయట పడిన ప్యూపాలు, గుడ్లను కొంగలు, కాకి, చిన్న చిన్న పక్షులు తినడంతో పంటలకు చీడ పురుగుల బాధ తప్పుతుంది.

వర్షాకాలానికి ముందే..

వర్షాకాలం రాక ముందే భూమిని రెండు లేదా మూడుసార్లు నాగలితో దున్నాలి. దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా చేసుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే అవకాశం ఉంటుంది. దుక్కి దున్ని భూమిని ఆరబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు. పశువుల పేడ, కంపోస్టు ఎరువులను కలియ దున్నాలి. దీంతో భూమి సారవంతమవుతుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది.

ఖర్చు తగ్గించుకోండిలా..

యాజమాన్య పద్ధతులతో సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే ఆర్బీకేల్లో భూసార పరీక్షలు చేయించుకొని, లోపాలుంటే వాటికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలు అందించాలి. వేప నూనె, ప్రకృతి వ్యవసాయం ద్వారా చేస్తున్న కషాయాలు పిచికారి చేయటం వల్ల తెగుళ్ల సోకకుండా చూడొచ్చు. ఏప్రిల్ నుంచి మాగాణిలో పచ్చి రొట్ట పైర్లు సాగుకు జనుము, పిల్లిపెసర, జీలు ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఆర్బీకేల్లో అందిస్తోంది. నీటి పొదుపునకు బిందు సేద్యం అవలంబించాలి.

సర్వమానవ సంక్షేమమే రామానుజుల ఆశయం



ప్రసంగిస్తున్న గరిమెళ్ల కూర్మనాథాచార్యులు

తెనాలి: సర్వమానవులు శాంతి, సామరస్యాలతో జీవించాలన్నదే శ్రీ భగవత్ రామానుజాచార్యుల ఆశయమని, అందుకోసం జీవితకాలం కృషిచేశారని నడిగడ్డపాలేనికి చెందిన పండితుడు 'ఉపన్యాస భూషణ' గరిమెళ్ల కూర్మనాథాచార్యులు చెప్పారు. ఆయన బాటలో నడవటమే మానవాళికి శ్రేయస్కరమని సూచించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళశాసనాలతో, శ్రీశరణాగతి గోష్టి ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీభగవత్ రామానుజాచార్యుల 1006 తిరునక్షత్ర మహోత్సవాలు తెనాలిలో ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రైవేటు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా రెండో రోజైన శనివారం రాత్రి 'శరణాగతి గద్య' అనే అంశంపై కూర్మనాథాచార్యులు ఉపన్యసించారు. భగవత్ రామానుజులు గురువు దగ్గర భక్తిని చూపుతూ, సమస్త విద్యలు అభ్యసించినట్టు తెలిపారు.

జొన్న, మొక్కజొన్న పంట పొలాల సందర్శన

తెనాలిటౌన్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర రావడం లేదని సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలం కోపల్లె, గుడివాడ గ్రామాల్లోని మొక్కజొన్న, జొన్న పంట పొలాలను సీపీఎం నాయకులు సందర్శించారు. పొలాల్లో ఉన్న రైతులకు కర పత్రాలు పంపిణీ చేశారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ప్రకటించకపోవడంతో రైతులు జొన్న, మొక్కజొన్న అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీసీఐ, ఎఫ్‌సీఐలను మూసివేయడం, ధాన్యం సేకరణకు నిధులు కేటాయింపులు తగ్గించడం వల్ల రానున్న కాలంలో బడా వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద రైతాంగం ఆధార పడేలా మోదీ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు కడియాల రామకృష్ణ, సీపీఎం నాయకుడు ఎం.సాంబశివరావు, కె.ప్రసాద్, హైమారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు ఉద్దేశించి మాట్లాడుతూ పంట మార్పిడితో రైతులంతా అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వేసవిలో పంట పొలాలలో నవధాన్యాల సాగు ద్వారా భూమిలో సారవంతం పెరగడంతో పాటు రైతులకు లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. ప్రతి రైతు వేసవిలో పంట పొలాన్ని ఖాళీగా ఉంచకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తమ్మా దుర్గా ప్రసన్న పాల్గొన్నారు.

సిద్ధాంతాలు నచ్చి బీజేపీలో చేరాను

పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర ప్రభు, పక్కన పలువురు బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం, బీజేపీ పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరానని ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు చెప్పారు. శనివారం గుంటూరు విద్యానగర్‌లోని ఓ హోటల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో శుక్రవారం బీజేపీలో నూతనంగా చేరిన తులసి రామచంద్ర ప్రభు మాట్లాడారు. తనకు రాజకీయాలు తెలియవని, ఇప్పటివరకు ఒక నెల రోజులు మాత్రమే తాను రాజకీయాలలో ఉన్నానని వెల్లడించారు. తులసి సీడ్స్ అనే సంస్థను స్థాపించి వేలాదిమందికి ఉద్యోగ కల్పన చేశానన్నారు. పదవులు ఆశించి బీజేపీలోకి రాలేదని , ప్రజా సేవకోసమే రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ, తులసి యోగేష్ చంద్ర పాల్గొన్నారు.

బాపట్ల టు హైదరాబాద్.. స్లీపర్ సర్వీస్

బాపట్లటౌన్: బాపట్ల నుంచి హైదరాబాద్‌కు నూతనంగా నాన్ ఏసీ స్లీపర్ సర్వీస్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. స్లీపర్ బస్సు ప్రతి రోజు రాత్రి 10 గంటలకు బాపట్ల నుంచి బయల్దేరి పొన్నూరు, చేబ్రోలు, నారాకోడూరు మీదుగా హైదరాబాద్ (బీహెచ్ఈఎల్)కు తెల్లవారుజామున 4.45 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. రాత్రి 9.20గంటలకు హైదరాబాద్ బయలుదేరి నుంచి ఉదయం 6 గంటలకు బాపట్ల చేరుకుంటుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అమృతలూరు(వేమూరు): ప్యాపర్రు గ్రామంలోని ఇందిర ప్రియదర్శిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మోపర్రు ఏఆర్‌సీ హాస్టల్ విద్యార్థులకు పాంచాళవారం గ్రామంలోని పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు రామినేని చౌదరి, ప్రమీల దంపతుల జ్ఞాపకార్థం శనివారం మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవిని రామోహన్, గవిని వెంకటేశ్వరరావు, పల్లికొండ రాజు, వేములపల్లి శ్రీధర్, ఎ.లక్ష్మీనారాయణ, కొండపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రేపల్లె రూరల్: మోర్తోట పంచాయతీ జంగాలవారి పాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వైద్యులు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కారాని కృష్ణకుమారి, నాయకుడు శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడిలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈపోటీల్లో పలుప్రాంతాల నుంచి వచ్చిన 9జట్లు పాల్గొనగా విజేతగా యాంగ్రీ టైగర్స్ జట్టు నిలిచింది, రన్నరప్‌గా రైజింగ్‌స్టార్ జట్టు నిలవగా విజేతలకు నరసరావుపేటకు చెందిన లైఫ్‌కేర్ ల్యాబ్ అధినేత షేక్.మొహిద్దీన్(బుజ్జి) రూ.10,116, ట్రోఫీ అందజేశారు. రన్నరప్ విజేతలకు ఖలీం రూ.5,116 బహుమతి అందజేశారు.

రెండు మోటార్లు చోరీ

తాడేపల్లి రూరల్: మోటారు దొంగలు రెచ్చిపోయారు. శనివారం తెల్లవారుజామున రెండు విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లారు. రైతులు ప్రకాష్‌రెడ్డి, సోము వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట నుంచి మహానాడు కరకట్టకు వెళ్లే మార్గంలోని 40 అడుగుల రోడ్డులో పక్కపక్క పొలాల్లో మోటార్లు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఉదయం చూసేసరికి మోటార్లు విప్పదీసి దొంగిలించారని వాపోయారు. పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఇద్దరూ ఫిర్యాదు చేశారు.